ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 06 | ఫిబ్రవరి 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 40

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

పాతాళమెరక ....... 28-11-07
భీమవరం ........... 17-12-07
పాలమూరు ......... 13-12-07
అత్తిలి .................. 21-12-07
జిన్నూరు ............. 25-12-07
కాపవరం ............ 20-12-07

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2007, పాతాళమెరక)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బ్రహ్మం గురించి వర్ణిస్తూ సత్యం, శివం, సుందరం, అద్వైతం అని వేదంలో చెప్పారు. అద్వైతస్థితి మన హృదయంలో ఉంది. అది మనకు అందేవరకు పునర్జన్మలు వస్తూనే ఉంటాయి, ఈలోపుగా కాముడు, కాలుడు వీరిద్దరు మనలను విడిచిపెట్టరు. సృష్టిలోనికి జీవకోటిని కాముడు తీసుకొనివస్తాడు, చనిపోయే వారినందరిని తీసుకొని పోయేవాడే కాలుడు. కాముడు అంటే మన్మథుడు, కాలుడు అంటే యమధర్మరాజు. వీరిద్దరిని జయించినవాడు ఈశ్వరుడు. మనం ఈశ్వరుడిని స్మరించుకొంటూ ఉంటే, ఆయన పాదాలను ఆశ్రయిస్తే వీరిద్దరి నుండి బయట పడవచ్చు. రాబోయే జన్మ ఏది వస్తుందో మనకు తెలియదు. ఇప్పుడు మానవజన్మ వచ్చింది. ఈ దేహాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. భగవంతుడిని స్మరించే కాలం పెంచుకోవాలి. మన పనులు మనం చేసుకొంటూ, అవసరంలేని గొడవలకు వెళ్ళకుండా ఉంటే చాలా టైము మనకు సేవ్ అవుతుంది. ఆ టైమును భగవంతుడిని స్మరించటానికి, ధ్యానించటానికి ఉపయోగించుకోవాలి.

ఈ దేహం పుట్టినరోజు నిజమైన పుట్టినరోజు కాదు, నీ హృదయంలో చైతన్యం ఉంది, అది నీకు ఎరుకలోనికి వస్తే అదే నిజమైన పుట్టినరోజు. బర్త్‌డే, డెత్‌డేలు ఇదంతా మాయ, ఇదంతా అజ్ఞానం. అజ్ఞానం ఉన్నంతసేపు మనకు జన్మలు వస్తూనే ఉంటాయి. అజ్ఞానం తొలగించుకోవటానికే ఈ శ్రవణాలు, మననాలు, స్మరణ, ధ్యానం, విచారణ ఇవిఅన్నీ. మనం శరీరంతో ఏ పని చేస్తున్నాము అన్న విషయం కంటే మనస్సుతోటి ఏది స్మరిస్తున్నాము అనేది ముఖ్యం. మేము మంచివారము, మేము బుద్ధిమంతులము అని శవాల్లా కూర్చొని మనస్సుతోటి చెడ్డవిషయాలు ఆలోచిస్తూ ఉంటే ఏమీ ప్రయోజనం లేదు.

మనం మనస్సును బాగుచేసుకోవాలి. ఎందుచేతనంటే ఈ శరీరాన్ని కల్పించేది, లోకాన్ని కల్పించేది, నీవు వేరు నేను వేరు అనే వేరుబుద్ధిని కల్పించేది అంతా మనస్సే. పునర్జన్మలను తీసుకొని వచ్చే హేతువులు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనం చేసే సాధనలు అన్నీ కూడా మనస్సును బాగుచేసుకోవటానికే. మీ మనస్సు ఏ విషయాలను స్మరిస్తోందో, ఏ విషయాల గురించి ఆలోచిస్తోందో మీకు తెలుస్తుంది కదా, అది జాగ్రత్తగా చూసుకోండి. శరీరం చేసే దానికంటే మనస్సు చేసే దానికే ఎక్కువ అపచారం వస్తుంది. ఏదైనా ఒక వస్తువుకు నిప్పు పెడితే అది వెంటనే తగులబడదు, అది తగలబడటానికి కొంతటైము పడుతుంది. అరుణాచల దీపాన్ని ఎవరైతే దర్శించి వచ్చారో వారి అజ్ఞానానికి నిప్పు పెట్టినట్లు అవుతుంది. అజ్ఞానం పూర్తిగా బర్నవ్వటానికి చాలా టైము పట్టవచ్చు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోవటానికి ఆ దీపదర్శనం మనకు సహకరిస్తుంది, అంటే బాహ్యంగా దాని ప్రయోజనం వెంటనే కనబడకపోయినా, నెమ్మదిగా కనిపిస్తుంది.

మనలో ఉన్న అజ్ఞానం నశించటానికి భగవంతుడు చెప్పిన మాటలనుగాని, మహర్షులు చెప్పిన మాటలనుగాని ప్రమాణంగా తీసుకోవాలి గాని ఎల్లయ్య చెప్పిన మాటలను, పుల్లయ్య చెప్పిన మాటలను మీరు ప్రమాణంగా తీసుకోకూడదు. వారు అహంకారంతో కాలిపోతూ ఉంటే ఇంక మనకు ఏమి చెప్పగలరు. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ ఉంటే మనలో ఉన్న అజ్ఞానం అంతా నశిస్తుంది. ఇతరులకు మనపట్ల ఉన్న రాగద్వేషముల మీద మన జీవితాలు ఆధారపడి లేవు. ఈ సృష్టిలో ప్రతీ జీవకోటి యొక్క జీవితం ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. అట్టి ఈశ్వరుడిని ఆరాధించకుండా ఆయన పాదాల దగ్గరకు మనం చేరుకోలేము. మనం తొందరగా చనిపోవాలి అని అనుకోకూడదు, చిరకాలం జీవించాలి అని అనుకోకూడదు. అలా అనుకొంటే ఈశ్వర సంకల్పాన్ని అగౌరవపరచినట్లు అవుతుంది. మనం కంగారుపడటం వలన తొందరగా తీసుకొని వెళ్ళడు, ఇంకా జీవించాలి అనే కోరిక ఉన్నంత మాత్రంచేత ఆయన నిర్ణయానికి భిన్నంగా కాలాన్ని పొడిగించడు. ఈ సృష్టిలో ప్రతీ సంఘటన ఆయన సంకల్పం ప్రకారమే జరుగుతుంది. జన్మాంతరం నుండి వస్తున్న సంస్కారములనుబట్టి పుణ్యకర్మ ఎంత అనుభవించాలి, పాపకర్మ ఎంత అనుభవించాలి, ఎప్పుడు సుఖం వస్తుంది, ఎప్పుడు దుఃఖం వస్తుంది ఇవన్నీ ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. మనం ఈశ్వరుడిని ప్రార్థించటం ఎందుకు అంటే ఏదో 200 సంవత్సరాలు బతకటం కోసం కాదు, మనం పవిత్రులం అవ్వటానికే ఈశ్వర స్మరణ. తపస్సు చేయటం వలన ఏకాగ్రత, పవిత్రత వస్తాయి అని వ్యాసమహర్షి చెప్పాడు. మనస్సుకు ఏకాగ్రత వచ్చినప్పుడు బయట ఏదో ఉందని బాహ్యముఖంగా ప్రయాణం చేయటం ఆగిపోతుంది, దానికి అంతర్దృష్టి కలుగుతుంది. అప్పుడు నీకు అమృతానుభవం కలుగుతుంది.

ఒక్క చైతన్యం తప్పించి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. గుళ్ళు, గోపురాలు, పునర్జన్మలు, సంతోషాలు, దుఃఖాలు, గొప్పలు, తిప్పలు అన్నీ మనోకల్పితాలు. గుడులు, గోపురాలు ఎందుకు పెట్టారు అంటే ఉపాసనకు మనకు ఏదో సపోర్టు ఉండాలి. పూర్వపు మహర్షులు ఏమి చేసారు అంటే ఏదో రూపాన్ని పెట్టి వారి తపోశక్తిని ఆ రూపంలో నింపి, మనం ఆ రూపాన్ని దర్శించుకొంటే ధన్యులయ్యేలాగ దేవాలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉపాసన లేకపోతే మనోచాపల్యం తగ్గదు. ఆధ్యాత్మికం అంటే అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుతురులోనికి ప్రయాణం. మనకు జన్మాంతరంలో ఉన్న సంస్కారమునకు అనుగుణంగా మనకు ఇష్టమైన మార్గంలో సాధన చెయ్యటం మంచిది, అనుకరణ పనికిరాదు. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించలేకపోవటానికి కారణం భయం. ఊహించుకోవటం వలన భయం వస్తోంది. మనం ఏమీ ఊహించుకోము అనుకోండి, భగవంతుడి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది అనుకొంటే నెమ్మదిగా భయం తగ్గిపోతుంది. అది అలా జరుగుతుందేమో, ఇది ఇలా జరుగుతుందేమో అని ఏదో ఊహించుకొంటూ ఉంటే ఆ జరిగేది మీరు ఎలాగూ ఆపుచేయలేరు. మీరు ఊహించుకోవటం మానివేస్తే సాధనతో సంబంధం లేకుండా భయం తగ్గిపోతుంది. భయస్థులు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేరు, భౌతికంగా కూడా అభివృద్ధి చెందలేరు, భయస్థులకు ఉభయభ్రష్టత్వం వస్తుంది.

పొగడ్తలను, విమర్శలను మీరు లోపలకు తీసుకోవద్దు. అవి మీ మనస్సులోనికి వస్తే మనస్సు పొల్యూట్ అయిపోతుంది. మీకు పాండిత్యం ఉంది, సంఘసేవ చేస్తున్నారు, మీరు హైలీఎడ్యుకేటెడ్ అని అరుణాచలంలో ఒకరితో అన్నాను, ఆయన ఏమన్నారు అంటే ఇవన్నీ అవుట్‌సైడ్ గొడవలండి అన్నారు. నా పాండిత్యం, నేను చేస్తున్న సంఘసేవ, నాకున్న గౌరవం ఇవన్నీ బయటగొడవలు. వీటివలన మనకు ఏమీ కలిసిరాదు. మనం ఎలా జీవిస్తున్నాము, లోపల మన అంతస్థు ఏమిటి, మనం ఏ భావంతో మాట్లాడుతున్నాము, ఏ భావంతో పనిచేస్తున్నాము, లోపల సూక్ష్మదేహం పవిత్రంగా ఉందా అవి ముఖ్యం. ఈ బయట గొడవలు ఎంత అబద్ధమో అంత నిజం అని మనం అనుకొంటున్నాము కాబట్టి వాటిని చూసి విర్రవీగిపోతున్నాము, మనలను ఎవరూ పట్టుకోలేక పోతున్నారు, దేహగతమైన నేను పెరిగిపోతోంది. ఇండివిడ్యువల్ ఐ లో నుండి ఫుల్‌నెస్‌లోనికి ప్రయాణం చేయటమే స్పిరిట్యువల్ జర్నీ, దీనికోసం ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో, సాధన చేస్తున్నాడో వాడే సాధకుడు. దేవుడికంటే వేరుగా ఏదీ లేదు అంతా ఒకటే ముద్ద అనేటువంటి అనుభవం ఎవడికైతే కలిగిందో, ఆ ఫుల్‌నెస్ ఎవడికైతే వచ్చిందో వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. ఒక మనిషిని చూసేటప్పుడుగాని, ప్రకృతిని చూసేటప్పుడుగాని మన మనస్సులో ఏమి జరుగుతోందో, మన బుద్ధిలో దోషాలు ఏమిటో పరిశీలనగా చూసుకోవాలి, ఇవే కదా మనకు నిజమైన శత్రువులు అనుకొని, వాటిని నిరంతరం జాగ్రత్తగా

పరిశీలిస్తూ ఉంటే అవి నెమ్మదిగా పల్చబడిపోతాయి. జ్ఞాని ఏది చెప్పినా నిండుహృదయంతో చెపుతాడు. జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది, అక్కడ కపటం ఉండటానికి అవకాశం లేదు. మనస్సు పరమాత్మలో అణిగిఉన్నప్పుడు ఒక మాట చెప్పారంటే ఆమాట జరిగితీరవలసిందే. జటాయువుతో రాముడు ఏమన్నాడు వెళ్ళు, నువ్వు వైకుంఠానికి వెళ్ళు అన్నాడు, వెళ్ళిపోయింది, ఆ మాటే ఆదేశం.

సత్యం మన హృదయంలోనే ఉంది కాని అది ఉన్నట్లు కూడా మనకు తెలియటం లేదు. మహర్షులతోటి, మహాత్ములతోటి అనుబంధం వలన ఏదో ఉంది, ఏదో ఉంది అని మీ బుద్ధికి తెలుస్తూ ఉంటుంది, అప్పుడు దానిని అందుకోవటానికి మీరు సాధన చేస్తారు. ఆ గుర్తింపు కలుగజేసే వాడు, దానిని ఎరుకలోనికి తీసుకొని వచ్చేవాడు మహర్షి. భగవద్గీత చదువుతున్నాము అనుకోండి, అర్థం కావటం లేదు అని చదవటం మానకూడదు. భగవద్గీత ఎవరు చెప్పారు అంటే పరమాత్మ చెప్పాడు, చైతన్యం చెప్పింది. మనకు చైతన్యం అనుభవంలో లేదు. మనం దేహబుద్ధితోటి, అహంకారంతోటి అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. జీవలక్షణాలతో చదువుతూ ఉంటే అది అర్థం కాదు. అలాగని చదవటం మానకూడదు. అలా చదవగా, చదవగా ఎప్పుడో ఆయన అనుగ్రహం వర్షిస్తుంది, అవగాహన చేసుకొనే బుద్ధిని ఆయనే ప్రసాదిస్తాడు. భక్తి మంచిదే కాని అక్కడ ఎంతోకొంత బీజరూపంలో మనస్సు ఉంటుంది. నీవు వేరు, నేను వేరు అనే భావన ప్రహ్లాదుడికి ఎంతో కొంత ఉంది కాని ఆయన మహాభక్తుడు. నర్సింహస్వామి ఏమి చేసాడు అంటే ప్రహ్లాదుడి శిరస్సును టచ్ చేసి కొన్ని క్షణాలలో ద్వైతభావనను తీసేసాడు, అది భగవంతుడి అనుగ్రహం. మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కువ మన గురువుకు తెలుసు, భగవంతుడికి తెలుసు. ఒక పుష్పం దగ్గర కూర్చొన్నాము అనుకోండి, వాసన రాకుండా ఎలా ఉంటుంది. అది నీకు తెలిసినా, తెలియకపోయినా ఆ పుష్పంలో నుండి వాసన వస్తూనే ఉంటుంది. హోలీకంపెనీ అట్టిది. సత్పురుషుల సమక్షంలో వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. వారు సైలెంట్‌గా పని చేస్తారు. నువ్వు ఏ వాసన చేత, ఏ అలవాటు చేత పీడింపబడుతున్నావో చూసి నీకు తెలియకుండానే ఆపరేట్‌చేసి వాటిని బయటకు తోలేస్తారు. నీకు సహాయసహకారములు అందిస్తున్నట్లు కూడా నీకు తెలియనివ్వరు. వారు చేసేపని నార్మల్‌గా, నేచురల్‌గా జరిగిపోతుంది, నిన్ను అనుగ్రహిస్తున్నట్లు నీ ప్రక్కన కూర్చొన్నవాడికి కూడా తెలియనివ్వడు, అదీ జ్ఞాని యొక్క వైభవం.

గంటల తరబడి ఉపన్యాసాలు చెప్పి మీ లోపల ఉన్న ఒక్క వాసనను కూడా బయటకు తీయలేనివాడు గొప్పవాడా, మీతోటి ఏమీ మాట్లాడకుండా మౌనంగా పనిచేస్తూ మీలో ఉన్న వాసనను తొలగించేవాడు గొప్పవాడా? మీకు కావలసింది పనా లేక గొప్పలు, గొడవలా? మీతో ఏమీ మాట్లాడకపోయినా జ్ఞానియొక్క మౌనం అనుగ్రహం, చూపు అనుగ్రహం,

ప్రతీదీ అనుగ్రహమే. ఇక్కడ మాటలు ముఖ్యంకాదు, పని ముఖ్యం. మీరు రాంగ్‌పాత్‌లో వెళుతున్నారు అనుకోండి మిమ్మల్ని సరిచేసి రైట్‌పాత్‌లో ప్రయాణం చేసేటట్లు చూస్తాడు, వాడు గురువు. ఒక గ్రంథం చదివేటప్పుడు అర్థం చేసుకోవటంలో పొరపాటు రాకూడదు. పొరపాటు కనుక వస్తే అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. మనకు బుద్ధిసూక్ష్మత లేనప్పుడు పొరపాట్లు వస్తాయి. చెప్పినవాడు ఏ స్థాయిలో ఉండి చెప్పాడో ఆ చైతన్యస్థాయి మనకు లేనప్పుడు దానిని మనం అందుకోలేము. అందుకోలేకపోయినా పరవాలేదు, భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం అనుకొంటాము. ఇక్కడ మనం మనస్సుతో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. అక్కడ చైతన్యం చెప్పింది, అది నీ మనస్సుకు ఎలా అర్థమవుతుంది. అందుచేత నీ మనస్సును తీసుకొని వెళ్ళి అక్కడ సరండర్ చెయ్యి, అప్పుడు నీ మనస్సు అణుగుతుంది, అప్పుడు అక్కడ ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అంతేగాని నీ మనస్సుతో తెలుసుకోవటానికి నీ మనస్సుకు అది ఒక ఆబ్జెక్టు కాదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఎవరి సమక్షంలో నీకు శాంతి కలుగుతుందో, ఎవరి సమక్షంలో నీ మనస్సు అణుగుతోందో, ఎవరి సమక్షంలో జ్ఞానాన్ని సంపాదించాలనే బుద్ధి నీకు కలుగుతోందో వాడితో నీవు శృతి కలిపి, వాడిని గురువుగా తీసుకో. అసలు మనం డిజర్వు అయ్యి ఉంటే, మనకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే గురువు దగ్గరకు మనం వెళ్ళనక్కరలేదు, గురువే మన దగ్గరకు వస్తాడు. గురువు అంటే ఆత్మ, ఆత్మకు చావులేదు, అందుచేత చనిపోయిన గురువు అంటూ ఎవడూ ఉండడు ఆయన అలా పనిచేస్తూనే ఉంటాడు, జ్ఞాని చేసే పని మన కళ్ళకు కనబడదు. మీ ప్రయత్నం వలన, మీ తెలివి వలన తొలగించుకోలేనటు వంటి బండరాళ్ళలాంటి వాసనలు గురువు యొక్క దయ వలన బయటకు పోతాయి, గురువు యొక్క అనుగ్రహం అట్టిది.

కర్తృత్వబుద్ధి మన తెలివితేటల వలన, మన ప్రయత్నం వలన పోదు. ఫలితం ఆశించ కుండా సత్కర్మను చెయ్యగా చెయ్యగా ఇదంతా నేను చేయటం లేదు, భగవంతుడే చేస్తున్నాడు అనే బుద్ధి నీకు కలుగుతుంది. అప్పుడు కర్తృత్వం నశిస్తుంది. ఇదంతా భగవంతుడే చేస్తున్నాడు అనే అనుభవం నీకు వచ్చేవరకు నీకు కర్తృత్వం నశించదు అని ఆచార్యులవారు చెప్పారు. నేను కాదు చేసేది, ఇదంతా భగవంతుడే చేస్తున్నాడు అనే ఆ చిన్న గెడప దాటటానికి, ఆ చిన్న అవగాహన నీకు రావటానికి ఆయన దయ లేకుండా నీకు రాదు, అప్పటివరకు దుఃఖం నశించదు. కేవలం శరీరబుద్ధి పెట్టుకొని ఎంతసేపు ఏమి తింటున్నాము, ఏమి కట్టుకొంటున్నాము, ఈ శరీరాన్ని అందరూ గౌరవిస్తున్నారా లేదా అని చూసుకొంటూ నూటికి నూరుపాళ్ళు దేహపోషణబుద్ధిలో ఉంటూ మోక్షాన్ని పొందాలనుకోవటం ఎటువంటిది అంటే ఒక మొసలిని నమ్ముకొని నదిని దాటటం వంటిది అని ఆచార్యులవారు చెప్పారు, అంటే ఇంక వారికి జ్ఞానం రాదు. మన మనస్సులో పవిత్రత ఉంటే మన ఇష్టదైవం కనిపిస్తాడు,

మాట్లాడతాడు, అందులో సందేహం లేదు. రామకృష్ణపరమహంసగారు దేవుడితో మాట్లాడేవారు. నీకు దేవుడు కనిపించవచ్చు, వరాలు ఇవ్వవచ్చు, ఇవన్నీ వ్యవహారికసత్యములే. కాని నేను దేవుడిని చూసాను, దేవుడు నాకు వరాలిచ్చాడు అనే ఫాల్స్ ఐ నీలోపల ఉన్నాడు కదా, ఆ నేను అనే సమస్య నిశ్శేషంగా పరిష్కారం అయ్యేవరకు నీకు బ్రాహ్మీస్థితి కలుగదు.

మనం చేసే సాధనలు గోరువెచ్చని నీళ్ళులాగ చేస్తున్నాము. సాధన ఎలా చెయ్యాలి అని పెద్దలు చెపుతారంటే ఏరోజుకారోజు నా జీవితానికి ఇది చివరిరోజు అని చెయ్యాలి. వారం రోజులలో నీవు చనిపోతావు అని పరీక్షిత్‌మహారాజుకు శాపం పెడితే ఆయన ఎంతో శ్రద్ధగా భాగవతం శ్రవణం చేసి వారం రోజులలో తరించాడు. ఇంక రేపు మనం ఉండము, ఇదే చివరిరోజు అనుకొంటూ సాధన చేస్తే నీవు తప్పనిసరిగా సక్సెస్ అవుతావు, సాధనాఫలం ఎప్పుడో కాదు, ఇప్పుడే నీకు అందుతుంది, నీకు శాంతి కలుగుతుంది. ఎంతో కొంత మనం ప్రయత్నం చేయాలి, ప్రయత్నం చేస్తూ ఉంటే కాలం కలిసివస్తుంది. మీరు తొందరపడవద్దు. మీరు చేసే ప్రతీ ప్రయత్నం భగవంతుడు చూస్తూ ఉంటాడు. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు, అది మర్చిపోవద్దు. మనం చేసే ప్రయత్నం వ్యర్థం అవ్వనివ్వడు. బ్రాహ్మీస్థితి పొందటానికి ఆ ప్రయత్నం నీకు సహకరించేలా చేస్తాడు. మీరు చేసే మంచిగాని, ప్రయత్నంగాని ఏదీ వృథా పోదు, నీది నీకే ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు. మనం న్యూస్ పేపర్‌ని నమ్ముతాముగాని భగవంతుడి మాటలను నమ్మము ఎందుచేతనంటే మనది పాడుబుద్ధి. దైనందిన జీవితంలో మన బిహేవియర్ కపటం లేకుండా చూసుకొంటే మనకు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. లౌకికులతో సహవాసం ఉంటే నెమ్మదిగా తగ్గించుకోండి లేకపోతే నెమ్మదిగా మన బ్రెయిన్ పొల్యూట్ అయిపోతుంది. మీకు ఆధ్యాత్మికశక్తి వచ్చాక లౌకికులతో స్నేహం చేసినా ఫరవాలేదు. చెట్టు పెద్దది అయిపోయిన తరువాత మేకలు, గొర్రెలు మొదలుకు రాసుకొన్నా ఫరవాలేదు కాని చెట్టు చిన్నదిగా ఉన్నప్పుడు మేకలు రాసుకొంటే ఆ మొక్క పడిపోతుంది. ఆధ్యాత్మికంగా మనం పిల్లలుగా ఉన్నప్పుడు బహుజాగ్రత్తగా ఉండాలి.

పట్టించుకోవలసింది పట్టించుకోండి, వదిలేయవలసింది వదిలేయండి అని భగవాన్ చెపుతారు దాని అర్థం ఏమిటి అంటే చేతిలో ఉన్న పనిని పట్టించుకోండి శ్రద్ధగా చెయ్యండి, దాని ఫలితం గొడవ వదిలేయండి, ఆ ఫలితం మన చేతిలో లేదు, అది ఈశ్వరుడి చేతిలో ఉంది. కర్మఫలితం మనం వదిలేయకుండా దానిని పట్టుకొన్నా అది మన ఇష్టానుసారం ఉండదు. అందుచేత మీరు పట్టించుకోవలసింది పట్టించుకొంటే అంటే మీరు చేసే పని హృదయపూర్వకంగా, ఏకాగ్రంగా, శ్రద్ధగా కనుక చేస్తే అది కూడా భక్తితో సమానమే. మీ చేతిలో ఉన్న లౌకికకర్మను ఏకాగ్రంగా, పవిత్రంగా చేస్తూఉంటే, ఈశ్వరుడి ప్రీత్యర్థం చేస్తూ ఉంటే అది భౌతికపని కింద మీకు అనిపిస్తుంది కాని అది కూడా ఆధ్యాత్మికమైన పనే.

వదిలేయవలసింది వదిలేయండి అంటే కర్మఫలితం గొడవ వదిలేయండి. ఒకోసారి మనం అనుకొన్నది వస్తుంది, ఒకోసారి అనుకొన్నది రాదు, ఒకోసారి తక్కువ వస్తుంది, ఒకోసారి ఎక్కువ వస్తుంది. ఒకోసారి అసలు రాదు, ఇదంతా ఈశ్వరుడి చేతిలో ఉంది కాబట్టి మీరు దానిని వదిలేయండి. కర్మ చేయటం వలన అశాంతి రాదు, కర్మఫలం మీద కాంక్ష ఎక్కువగా ఉన్నప్పుడు అశాంతి వస్తుంది. పట్టించుకోవలసింది పట్టించుకోండి, వదిలేయవలసింది వదిలేయండి ఈ రెండు మాటలు మీకు అర్థమైతే మరణానంతర జీవితం మాట ఎలా ఉన్నా ఈ ప్లానెట్ మీద మీరు బతికిఉన్న రోజులు సుఖంగా, శాంతిగా బతకవచ్చు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-12-2007, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం చివరిరోజులలో భక్తిని పెంచుకోవాలి. ఒంటిగంట దాటాక సూర్యుడు అస్తమించేవైపుకు వెళతాడు. మన జీవితాలు కూడా అంతే 50 ఏళ్ళు దాటాక మనకు అస్తమించే రోజులు అంటే ఇంక పోయేరోజులే కాని వచ్చేరోజులు కాదు. 50 ఏళ్ళకు ముందు భక్తి ఉండకూడదు అని కాదు కనీసం 50 ఏళ్ళు జీవించిన తరువాత అయినా మనం ఏ వృత్తిలో ఉన్నా కూడా భక్తిని హితవు చేసుకొని జాగ్రత్తగా పెంచుకొంటూ రావాలి. ఏదో ఇడ్లీ తిన్నట్లు, అన్నం తిన్నట్లు ఇది ఒక్క రోజులో రాదు. సత్పురుషుల సహవాసం చేస్తూ, ఎప్పుడైనా దగ్గరలో ఉన్న గుడిలో పదినిమిషాలు కూర్చొంటూ, ఉపయోగపడే గ్రంథాలను చదువుకొంటూ, గొప్పలకు గౌరవాలకు వెళ్ళకుండా జీవిస్తూ సాధనా సంస్కారాన్ని నెమ్మదిగా పెంచుకోవాలి. ఇది జనంవలన, ధనంవలన వచ్చేదికాదు. జాగ్రత్తగా మనం అనాత్మను విడిచిపెట్టి ఆత్మను ధ్యానం చేసుకొంటూ చివరిరోజులు వచ్చేసరికి మనం ఏదికాదో దానితో తాదాత్మ్యం తగ్గించుకొని ఏదిఅవునో దాని దగ్గరకు జరుగుతూఉండాలి. రామకృష్ణపరమహంసగారు భోదిస్తూ భోదిస్తూ మధ్యలో ఆగిపోతూ ఉండేవారు. ఆయనకూడా ఎప్పడూ మహేంద్రనాథ్ గుప్తా అని ఒక రిటైర్డ్ హెడ్‌మాష్టారు ఉండేవారు. ఏమిటి గుప్తా నన్ను ఏమి చెప్పమంటారు మీకు. నాకో శరీరం ఉందని మరుపు వచ్చేస్తోంది. ఇలా మరుపు వస్తూ ఉంటే నేను మీకు ఏమి భోదిస్తాను అనేవారు. మహేంద్రనాథ్! నాలో ఏదైనా కొంచెం అహంకారం మీకు కనిపిస్తోందా? అసలు అహంకారం లేకుండా నేను ఉన్నానా? అంటే నూటికి నూరు పాళ్ళు అహంకారం లేకుండా మీరు లేరు, కొంచం కనిపిస్తోంది అన్నారు హెడ్‌మాష్టారు. మీరు అవతారపురుషులు, దానిని మీరు పోగొట్టుకోవాలంటే పోగొట్టుకోగలరు కాని మాకు భోదించటానికి ఆ తెరను అడ్డుపెట్టుకొంటున్నారు అని చెప్పారు. మహేంద్రనాథ్ గుప్తా! నాకు ఎంతోకొంత అహంకారం ఉందని నువ్వు చెపుతున్నావు, అది నిజమే. కాని అది నేను అట్టి పెట్టుకోవటం లేదు, దేవుడే కావాలని అట్టిపెట్టాడు. ఆ చిన్న తెర లేకపోతే మీకు భోదించేవాడు ఎవడూ కనబడడు. నేను అట్టిపెట్టుకొన్నానని నువ్వు చెపుతున్నావు, నాకెందుకు వాడే